**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ. 04.03.2026** **సమయం. 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1.** సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జి.వివేక్ లు అధికారులకు ఆదేశించారు.

**2.** "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖలో నాలుగు దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ దిశా నిర్దేశం చేశారు.

**3.** ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను తరచూ మార్చడం ద్వారా ఫలితాలు రావని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత హరీష్ రావు అన్నారు.

**4.** రేపు, ఎల్లుండి రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**రివ్యూ**

సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జి.వివేక్.. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. జులై నెలాఖరులోగా రైతులకు సాగు నీరు అందించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ.. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26లోగా పూర్తి చేయాలని ఆదేశించారు మంత్రులు. అలాగే, పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనుల డీపీఆర్ లను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు.

## దామోదర

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా.. నాలుగు దశల్లో ఈ కార్యక్రమాలను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

## పొన్నం ప్రభాకర్

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం రాజకీయ పార్టీగా కాంగ్రెస్ హక్కు అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కాదని ఆయన అన్నారు. ప్రజలే న్యాయ నిర్ణేతలని, ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసంపైనే పదవులు ఆధారపడి ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజల ఐక్యతను రాహుల్ గాంధీ చాటారని, అలాంటి నేతను విమర్శించడం తగదని ఆయన అన్నారు.

## రాజ్యసభ సభ్యులు

తెలంగాణ నుంచి ఎన్నికలు జరుగుతున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ నేతలతో నేరుగా చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. ఇప్పటికే ఒక స్థానాన్ని అధిష్టానం ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించగా, ఆయన రేపు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇక రెండో స్థానం కోసం పోటీ నెలకొంది. దీనిపై ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్‌లో చర్చల అనంతరం అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

పిటిసి, హైదరాబాద్

**వాకిటి**

**తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని అంతర్జాతీయ క్రీడాకారుడు మ్రుత్యుంజయ సుంకర్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. అబుదాబిలో జరిగిన ఓపెన్ వరల్డ్ మాస్టర్స్ గేమ్స్ 2026లో ఆడిన మ్రుత్యుంజయ సుంకర్.. కాంపిటేటివ్ క్రికెట్స్ విభాగంలో రజత పతకం సాధించారు. అంతర్జాతీయ వేదికపై తాను సాధించిన విజయానికి సంబంధించిన విశేషాలతో పాటు... అర్చరీ కోచ్ పరీక్షల్లో అర్హత సాధించిన విషయాన్ని ఆయన మంత్రి ద్రుష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తీసుకువచ్చిన మృత్యుంజయను ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు.**

**చామల**

**సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ నుంచి కొమురవెల్లి మండలంలోని తపాస్ పల్లి రిజర్వాయర్ వరకు ఆయకట్టును స్థిరీకరించాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఫలితంగా దూల్మిట్ట, చేర్యాల మండలాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సరఫరాకు సంబంధించి గతంలో ఇచ్చిన తాత్కాలిక జీవోను రద్దు చేసి శాశ్వత జీవోను ఇవ్వాలని విన్నవించారు. తన విజ్ఞప్తికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.**

**ఎక్సర్ సైజ్ తాస శక్తి**

**సికింద్రాబాద్ లోని మిలిటరీ స్టేషన్‌లో 'ఎక్సర్‌సైజ్ తాస శక్తి' పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా ప్రధాన కార్యాలయం నిన్న బహుళ-సంస్థల భద్రతా చర్చాగోష్టిని నిర్వహించింది. భారత వాయుసేన, నౌకాదళం, తెలంగాణ రాష్ట్ర పోలీసు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం, జాతీయ భద్రతా గార్డులు, భారతీయ రైల్వే, రైల్వే రక్షణ దళం, ప్రభుత్వ రైల్వే**

పోలీసు విభాగాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మాట్లాడుతూ... భద్రత విషయంలో ఇంటర్-ఏజెన్సీ సహకారం ఆవశ్యకతను చెప్పారు. ఆధునిక భద్రతా ముప్పుల సంక్లిష్టతలకు అన్ని ఏజెన్సీలు ఐక్యంగా ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందని, ఈ చర్చావేదిక ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక ముందడుగు అని పేర్కొన్నారు.

## సిబిఐ దర్యాప్తు

కాజీపేట పరిధిలో రైల్వే ట్రాక్ నిర్వహణ పనులలో జరిగిన అక్రమాల పైన సిబిఐ దర్యాప్తు చేస్తోంది. 2022-23 లో కాజీపేట పరిధిలో జరిగిన ట్రాక్ నిర్వహణ పనుల్లో ప్రైవేట్ సంస్థలు అక్రమాలకు పాల్పడినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కాజీపేట సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు నలుగురి పైన, ట్రాక్ మెయింటనర్లు ఇద్దరి పైన కేసులు నమోదు చేసి సిబిఐ అధికారులు విచారణ చేస్తున్నారు.

## పిటిసి, వరంగల్

## హరీష్ రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తరచూ మార్చడం వల్ల సత్ఫలితాలు రావన్నారు. విభాగ అధిపతులు సగటున 8 నెలలు కూడా పనిచేయట్లేదని, విద్యుత్ శాఖలో రెండేళ్ల కాలంలోనే ఐదుగురు ఉన్నతాధికారులు మారారని, దీంతో ఆ శాఖ అవినీతిమయం అయిందని ఆరోపించారు. అలాగే పలు విభాగాల్లో తరచూ ఉన్నతాధికారులను మారుస్తున్నారని అన్నారు. జిల్లాపై కలెక్టర్ కు అవగాహన రావడానికే 6 నెలలు పడుతుందని, ఆ లోపే బదిలీ అయిన కలెక్టర్లు ఎంతో మంది ఉన్నారని, దీంతో యువ కలెక్టర్లలో ఆత్మ స్థయిర్యం దెబ్బ తింటోందని హరీష్ రావు విమర్శించారు.

ప్రెస్ నోట్

## జి.ఎస్.ఐ వ్యవస్థాపక దినోత్సవం

భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ **176**వ వ్యవస్థాపన దినోత్సవం...హైదరాబాద్ లోని బండ్లగూడ-నాగోల్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జి.ఎస్.ఐ మాజీ డైరెక్టర్ జనరల్ ఎం. శ్రీధర్, జి.ఎస్.ఐ దక్షిణ ప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ వి.వి. మొగల్, **AMD, NGRI, CGWB** సహా పలు భూవిజ్ఞాన సంస్థల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. **1851**లో రైల్వేల కోసం బొగ్గు అన్వేషణతో మొదలైన సంస్థ ప్రయాణం నేడు అత్యాధునిక భూవైజ్ఞానిక ఆవిష్కరణల వరకు అభివృద్ధి పంథాలో నడిచిందని వక్తలు అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధికి ఎంతో అవసరమైన అరుదైన, వ్యూహాత్మక ఖనిజ వనరుల అన్వేషణలో జి.ఎస్.ఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

## VSS ప్రభాకర్

కాంగ్రెస్ సర్కార్ కు విజన్ లేదు, మిషన్ లేదని అని బీజేపీ మాజీ ఎమ్మెల్యే **NVSS** ప్రభాకర్ ఆరోపించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నా తెలంగాణలో ఇంకా అస్థిరత కనిపిస్తోందని విమర్శించారు. రెండేళ్లలో సుమారు 60 సార్లు ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు జరగడమే పరిపాలనలో స్థిరత్వం లేదనడానికి నిదర్శనమన్నారు. తన పదవిని కాపాడుకోవడం కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 60 సార్లకు పైగా ఢిల్లీ పర్యటనలు చేశారని **NVSS** ప్రభాకర్ ఆరోపించారు.

## అగ్నివీర్ ర్యాలీ

తెలుగు రాష్ట్రాల యువతీ, యువకులు భారత వాయుసేనలో చేరేందుకు ఈనెల **9** నుంచి ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల భారత వాయు సేన అధికారి, వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ తెలియజేశారు. ఈనెల **9, 10** తేదీల్లో మహిళా

అభ్యర్థులు. 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన పురుష అభ్యర్థులు. మార్చి 15, 16 తేదీల్లో తెలంగాణకు చెందిన పురుష అభ్యర్థులకు ఎంపిక పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అవసరం లేకుండానే..నేరుగా ర్యాలీకి హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అగ్నిపథ్ వాయు వెబ్ సైట్ లో చూడాలని సూచించారు.
డెస్క్

<u>ప్రపంచ ఉబకాయ దినోత్సవం</u>

ఆహారం తీసుకోవడంలో సమయపాలన పాటించాలని, వ్యాయామం చేయడం ద్వారా ఊబకాయాన్ని నివారించవచ్చునని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి చెప్పారు. ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ.......
బైట్ ... డాక్టర్ దీప్తి
పిటిసి, రాజన్న సిరిసిల్ల

<u>వాతావరణం</u>

రేపు, ఎల్లుండి తెలంగాణ వ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. నిన్న ఉత్తర ఒడిశా నుంచి విదర్భ ప్రాంతం వరకు కొనసాగిన ద్రోణి క్రమేపీ బలహీనపడిందని తెలిపారు.

<u>జాతీయ అవార్డులు</u>

జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా "సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డులకు" జిల్లాలోని చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జనగామ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు చౌడేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు చేనేత

రంగంలోని కళాకారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో  పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్" నిర్వహిస్తున్నామని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. ఇందులో తమ ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకం కోసం విశ్వకర్మ లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఈ ట్రేడ్ ఫెయిర్లో పాల్గొనదలచిన లబ్ధిదారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎర్రగట్టు గుట్ట, కొమ్మాల జాతరలు

హన్మకొండ జిల్లాలోని ఎర్రగట్టు గుట్ట వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు  ప్రారంభమయ్యాయి. హోలీ పండుగ రోజు ప్రారంభమయ్యే ఈ జాతర ఐదు రోజుల పాటు సాగుతుంది. మరోవైపు, వరంగల్ జిల్లా, గీసుకొండ మండలం, కొమ్మాలలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి.